JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | గురువారం 06-11-2025
Medchal - Malkajgiri | Thursday 06-11-2025
jayabherinews
సంపుటి : 02 | సంచిక : 160 | పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 160 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com





# చెత్త ఎవరిదో..
## సత్తా ఎవరిదో తేల్చుకుందామా

- హైదరాబాద్ అభివృద్ధికి మా పార్టీ ఏం చేసిందో. కాంగ్రెస్ రెండేళ్లలో ఏం చేసిందో చర్చకు రేవంత్ సిద్ధమా?
- రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

**జయభేరి, హైదరాబాద్ :**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జూబ్లీహిల్స్‌లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఈ రోజు నివేదికను విడుదల చేశారు. 'జూబ్లీహిల్స్ ప్రగతి నివేదిక' పేరిట తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో గత రెండేళ్లుగా హైదరాబాద్ అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో సాధించిన అభివృద్ధిని, కాంగ్రెస్ రెండేళ్ల పాలనతో పోల్చి ప్రజల ముందు చర్చించేందుకు ముఖ్యమంత్రిని ఆయన సవాలు చేశారు. "హైదరాబాద్ అభివృద్ధికి మా పార్టీ ఏం చేసిందో.. కాంగ్రెస్ రెండేళ్లలో ఏం చేసిందో చర్చకు రేవంత్ సిద్ధమా? చెత్త ఎవరిదో.. సత్తా ఎవరిదో తేల్చుకుందాం" అంటూ కమాండ్ కంట్రోల్ సెంటర్, జూబ్లీహిల్స్ నివాసం, గాంధీభవన్ లేదా అసెంబ్లీ.. ఇలా ఎక్కడైనా చర్చకు సిద్ధమని ప్రకటించారు.

**కేటీఆర్ ఆరోపణలు, విజయాల ప్రస్తావన..**

తాము అధికారంలో ఉన్నప్పుడు జూబ్లీహిల్స్‌లో 42 ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించామని, 'స్వచ్ఛ హైదరాబాద్', 'ఎస్ఎన్‌డీపీ' కింద పారిశుధ్యాన్ని మెరుగుపరిచామని కేటీఆర్ వివరించారు. అలాగే, డబుల్ బెడ్‌రూమ్ గృహాలు, హైదరాబాద్ మెట్రో విస్తరణ వంటి అనేక నగర రూపురేఖలు మార్చే ప్రాజెక్టులు చేపట్టామని ఆయన బీఆర్ఎస్ విజయాలను ప్రస్తావించారు. మరోవైపు, కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ఒక్క ఫ్లైఓవర్ గానీ, కొత్త రోడ్డు గానీ వేయలేదని ఆరోపించారు. కుంగుడు రిక్కలు (పట్టణాల్లో గుంతలు), నేరాలు పెరగడం, వేలాది ఇళ్లను కూల్చివేయడం, మెట్రో విస్తరణ

...మిగతాది 2 లో

# మరికాసేపట్లో
# బీహార్ పోలింగ్



- 18 జిల్లాల పరిధిలోని 121 నియోజకవర్గాల్లో ఓటింగ్
- ఈ ఎన్నికలు నితీశ్ ప్రభుత్వ పాలన, విశ్వసనీయతకు అగ్నిపరీక్ష
- అభ్యర్థులు, ఆసక్తికర పోరు
- ఈ ఎన్నికల్లో కళారంగానికి చెందిన ప్రముఖులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

**జయభేరి, పాట్నా, నవంబర్ 5 :**

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కీలకమైన తొలి దశ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. గురువారం 18 జిల్లాల పరిధిలోని 121 నియోజకవర్గాల్లో ఓటింగ్ జరగనుంది. ఈ దశలో మొత్తం 1,314 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, పలువురు ప్రముఖ నేతల భవితవ్యం తేలనుంది. మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగియడంతో అందరి దృష్టి ఇప్పుడు పోలింగ్‌పైనే కేంద్రీకృతమైంది. ముఖ్యంగా హోరాహోరీ పోరు నెలకొన్న కీలక నియోజకవర్గాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కేబినెట్‌లోని 16 మంది మంత్రులు ఈ దశలో తమ స్థానాలను నిలబెట్టుకునేందుకు పోటీ పడుతున్నారు. వీరిలో 11 మంది బీజేపీ కోటాకు చెందినవారు కాగా, ఐదుగురు జేడీ(యూ) మంత్రులు ఉన్నారు. ఈ ఎన్నికలు నితీశ్ ప్రభుత్వ పాలన, విశ్వసనీయతకు ఒకరకంగా అగ్నిపరీక్షగా మారాయి. మరోవైపు, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, ఆయన సోదరుడు, జనశక్తి జనతాదళ్ అధినేత తేజ్ ప్రతాప్ యాదవ్ కూడా తమ స్థానాల్లో గెలుపు కోసం తీవ్రంగా శ్రమించారు.

**అభ్యర్థులు, ఆసక్తికర పోరు**

ఈ ఎన్నికల్లో పలు నియోజకవర్గాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

...మిగతాది 2 లో



# రాహుల్ కు ఈసీ ఘాటూ రిప్లై

- కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు
- 'హైడ్రోజన్ బాంబ్' పేరుతో మీడియాతో లైవ్ ఏర్పాటు
- రాష్ట్రంలో మొత్తంగా 12.5 శాతం మంది ఫేక్ ఓటర్లు ఉన్నారు

**జయభేరి, పాట్నా, నవంబర్ 5:**

ఓట్ల చోరీ అంశంపై 'హైడ్రోజన్ బాంబు' పేరిట కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించగా, కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిస్పందించింది. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. 25 లక్షల ఓట్ల చోరీ జరిగిందని, బ్రెజిల్ మోడల్‌కు కూడా ఇక్కడ ఓటు ఉందని ఆరోపించారు. ఈ ఆరోపణలపై ఈసీ స్పందించింది. రాహుల్ గాంధీ ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను సమర్థిస్తున్నారా? వ్యతిరేకిస్తున్నారా? చెప్పాలని

...మిగతాది 2 లో

# ఆ రోడ్డే డేంజర్..
## ఆరేళ్లలో 200 మంది పైగా మృతి

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 5 :**

తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఖానాపూర్ గేటు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 20 మంది దాకా చనిపోయారు. వాస్తవానికి ఈ రోడ్డు మీద జరిగిన ప్రమాదం కొత్తదేమి కాదు. ఎందుకంటే ఈ రోడ్డు అత్యంత డేంజర్. ఆ జిల్లాలోనే కాదు.. ఏకంగా తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ప్రమాదకరమైన రహదారిగా ఇది పేరుపొందింది. ఈ రోడ్డు మీద జరిగిన ప్రమాదాలలో 200 మంది దుర్మరణం చెందారు. 600 మంది తీవ్రంగా గాయపడ్డారు. వాస్తవానికి ఈ రోడ్డు ఇలా ఎందుకు మారిందంటే.. జాతీయ రహదారి 163 అప్పా జంక్షన్ నుంచి కర్ణాటక సరిహద్దు వరకు రోడ్డు నిర్మించాలని ఎప్పటినుంచో ప్రతిపాదన ఉంది. అయితే ఈ రోడ్డుకు రెండు వైపులా కూడా చెట్లు విపరీతంగా ఉన్నాయి. దీంతో గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతులు ఇవ్వడం లేదు. అందువల్లే ఈ రోడ్డు నిర్మాణానికి అంతరాయం ఏర్పడుతోంది. హైదరాబాద్, బీజాపూర్ జాతీయ రహదారి



163 (ఇది చేవెళ్ల వికారాబాద్ తాండూరు రూట్) పై గడచిన ఐదు సంవత్సరాల కాలంలో విపరీతమైన రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇక్కడ రోడ్లు అత్యంత ఇరుకుగా ఉంటాయి. దీనికి తోడు షార్ప్ బెండ్స్ ప్రమాదకరంగా ఉంటాయి. ఈ రోడ్డు మీద ఓవర్ లోడ్ టిప్పర్లు నిత్యం వెళ్తూనే ఉంటాయి. రాంగ్ సైడ్ డ్రైవింగ్ వల్ల

...మిగతాది 2 లో



# 4 గంటల్లో 2 వేల సమస్యలు

- వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూమిని తప్పుడు పత్రాలతో కబ్జా
- పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని ఆవేదన
- దనపాన హరికృష్ణ మంత్రి నారా లోకేష్ ను కలిసి వినతిపత్రం

**జయభేరి, విజయవాడ, నవంబర్ 5:**

టీడీపీ కేంద్ర కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 70వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి నారా లోకేష్‌ను కలిసి సమస్యలు చెప్పుకునేందుకు పెద్దఎత్తున ప్రజలు, కార్యకర్తలు పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి నారా లోకేష్.. వారి నుంచి వినతులు స్వీకరించారు.

...మిగతాది 2 లో

# ట్రంప్ కు కోలేకోలేని దెబ్బ

- పార్టీకి దక్కని ప్రాధాన్యం



**జయభేరి, న్యూయార్క్, నవంబర్ 5 :**

అమెరికాలో జరిగిన 2025 స్థానిక ఎన్నికల్లో డెమోక్రట్ పార్టీకి ఘన విజయం లభించింది. వర్జీనియా, న్యూ జెర్సీ గవర్నర్ ఎన్నికలు, న్యూయార్క్ సిటీ మేయర్ రేసు సహా ముఖ్యమైన పోటీలలో డెమోక్రట్లు మొత్తం స్వీప్ చేశారు. ఇది రెండోసారి అధ్యక్షుడైన డొనాల్డ్ ట్రంప్‌కు మొదటి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. ఫెడరల్ ప్రభుత్వ షట్‌డౌన్, ఆర్థిక సమస్యలు, ట్రంప్ విధానాలపై అసంతృప్తి కారణంగా ఓటర్లు డెమోక్రట్ల వైపు మొగ్గు చూపారు. ఈ ఎన్నికలు ట్రంప్ రెండో టర్మ్ ప్రారంభానికి మొదటి పెద్ద టెస్ట్‌గా మారాయి. వర్జీనియాలో డెమోక్రట్ అబిగెయిల్ స్పాన్‌బర్గర్ రిపబ్లికన్ విన్సమ్ ఎర్ల్‌సియార్స్‌ను ఓడించి గెలిచి, వర్జీనియా చరిత్రలో మొదటి మహిళా గవర్నర్‌గా చరిత్ర సృష్టించింది. ఓటర్లు ఫెడరల్ వర్క్‌ఫోర్స్ లేఆఫ్లు, షట్‌డౌన్ ప్రభావాలపై ఆగ్రహం చూపారు. న్యూ జెర్సీలో కూడా

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## చెత్త ఎవరిదో..

ఆగిపోవడం వంటి అనేక వైఫల్యాలను సీఎం రేవంత్‌రెడ్డికి ఆపాదించారు. మున్సిపల్, హోంశాఖ మంత్రిగా ఆయన పూర్తిగా విఫలమయ్యారని కేటీఆర్ విమర్శించారు. ఈ చర్చ సవాలు ముఖ్యంగా నవంబర్ 11న జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంలో రావడం గమనార్హం. ఈ ఉప ఎన్నిక బీఆర్ఎస్ 10 ఏళ్ల ప్రగతికి, కాంగ్రెస్ రెండేళ్ల అవినీతికి మధ్య జరుగుతున్న పోరుగా కేటీఆర్ అభివర్ణించారు. "కార్‌కు ఓటు వేస్తే బుల్‌డోజర్లు ఆగుతాయి" అంటూ ఓటర్లకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి మగంటి సునీత (గోపీనాథ్ భార్య) విజయం ఖాయమని, రేవంత్‌రెడ్డికి ఓటర్లు తగిన పాఠం నేర్పుతారని కేటీఆర్ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. ఫార్ములాఈ, ఇతర నోటీసుల విచారణలు కేవలం దృష్టి మరల్చే పన్నాగాలేనని, కాంగ్రెస్‌బీజేపీ మధ్య 'అసూయపూరిత మైత్రి' ఏర్పడిందని ఆయన ఆరోపించారు. కేటీఆర్ చేసిన ఈ తీవ్ర విమర్శలు కాంగ్రెస్ పార్టీలో అసౌకర్యాన్ని కలిగించాయి. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లో మాట్లాడుతూ, బీఆర్ఎస్ మూడుసార్లు అవకాశం పొంది శూన్య ఫలితాలు చూపించిందని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిస్తే వందల కోట్ల రూపాయల అభివృద్ధి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ విధంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల వేళ బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం పతాక స్థాయికి చేరింది.

## మరికాసేపట్లో బీహార్ పోలింగ్

ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి ముంగేర్ జిల్లాలోని తారాపూర్ నుంచి పోటీ చేస్తున్నారు. ఇక్కడ ఆర్జేడీ అభ్యర్థి అరుణ్ కుమార్ షాతో పాటు, జన్ సురాజ్, జన్ తంత్రిక్ జనతాదళ్ అభ్యర్థులు కూడా బరిలో ఉండటంతో చతుర్ముఖ పోరు నెలకొంది. వైశాలి జిల్లాలోని రాఘోపూర్, తేజస్వి యాదవ్ కుటుంబానికి కంచుకోటగా ఉంది. ఇక్కడ ఆయన ఎన్డీయే అభ్యర్థి సతీశ్ యాదవ్‌ను ఢీకొంటున్నారు. పాట్నా రూరల్ పరిధిలోని మొకామా స్థానం, దులార్‌చంద్ యాదవ్ హత్య కేసు నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక్కడ జేడీ(యూ) నుంచి అనంత్ సింగ్, ఆర్జేడీ నుంచి వీణా దేవి పోటీ పడుతున్నారు. ఇద్దరూ బలమైన రాజకీయ కుటుంబాలకు చెందిన వారు కావడంతో పోరు రసవత్తరంగా మారింది. ఈ ఎన్నికల్లో కళారంగానికి చెందిన ప్రముఖులు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ప్రముఖ జానపద గాయని మైథిలి ఠాకూర్‌ను బీజేపీ దర్భంగా జిల్లాలోని అలీనగర్ నుంచి బరిలోకి దించింది. ఆమె ఆర్జేడీ అభ్యర్థి వినోద్ మిశ్రాతో తలపడుతున్నారు. మిథిలాంచల్ ప్రాంతంలో మైథిలికి ఉన్న ప్రజాదరణ ఆమెకు ఎంతవరకు కలిసొస్తుందో చూడాలి. భోజ్‌పురి సూపర్ స్టార్ కేసరి లాల్ యాదవ్ సారన్ జిల్లాలోని ఛాప్రా నుంచి ఆర్జేడీ తరపున పోటీ చేస్తున్నారు. ఇక, లఖిసరాయ్‌లో ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా కాంగ్రెస్ అభ్యర్థితో తలపడుతూ వరుసగా మూడో విజయంపై కన్నేశారు. బేగుసరాయ్‌లో బీజేపీ అభ్యర్థి కుందన్ కుమార్‌కు, కాంగ్రెస్‌కు చెందిన అమితా భూషణ్‌కు మధ్య పోటీ నెలకొంది. ఇక్కడ కుల సమీకరణాలు కీలకం కానున్నాయి. పాట్నాలోని పట్టణ నియోజకవర్గమైన బకీపూర్‌లో బీజేపీ నేత నితిన్ నబిన్ మరోసారి పోటీ చేస్తున్నారు.

## ఆ రోడ్డే డేంజర్..

ప్రతినెల రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. సోమవారం నాటి రోడ్డు ప్రమాదానికి రాంగ్ సైడ్ డ్రైవింగ్ ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇక గత ఏడాది డిసెంబర్ 2న ఆలూరు గేటు వద్ద ఓ లారీ కూరగాయల విక్రయిస్తున్న వ్యాపారుల మీదకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో నలుగురు చూస్తుండగానే చనిపోయారు. పదిమంది అత్యంత తీవ్రంగా గాయపడ్డారు. అంతకంటే ముందు రోజు ఇదే ప్రాంతంలో ప్రమాదం జరిగింది. మీర్జాగూడ గేటు దగ్గర ఒక కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. ఇదే ఏడాది ఆగస్టు 26న చేవెళ్ల బస్సు స్టాండ్ దగ్గర సిమెంట్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తండ్రీ కూతురు దుర్మరణం చెందారు. పరిగి, రంగాపూర్ రహదారిలో ఆగి ఉన్న లారీని పెళ్లి బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇక సోమవారం జరిగిన ప్రమాదంలో 20 మంది స్పాట్ లోనే చనిపోవడం ఆందోళన కలిగిస్తోంది. 2018 నుంచి ఇప్పటివరకు జరిగిన అనేక ప్రమాదాలలో 200 మంది చనిపోయారు. దాదాపు 600 మంది గాయపడ్డారు. గాయపడిన వారు మొత్తం దివ్యాంగులుగా మారిపోయారు. ఈ రోడ్డు మొత్తం సింగల్ లైన్ లోనే ఉంటుంది. దీనిని నాలుగు వరుసలుగా నిర్మించాలని 2021 లోనే చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి కోరారు. ఈ రోడ్డు నిర్మాణానికి రేవంత్ ప్రభుత్వం అడుగు ముందుకు వేసింది. అయితే ఇక్కడి రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత స్వార్థాన్ని దృష్టిలో పెట్టుకొని రోడ్డు పనులకు అడ్డంకులు సృష్టించారు. ఫలితంగా ఈ రోడ్డు నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా మారిపోయింది. రోడ్డు ఇరుకుగా ఉండటం వల్లే సోమవారం రెండు వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదాల్లో 20 మంది చనిపోయారు. మృతుల్లో బస్సు, లారీ డ్రైవర్లతోపాటు పదిమంది పురుషులు.. 9 మంది మహిళలు ఉన్నారు. అందులో ఒక చిన్నారి కూడా ఉండడం అత్యంత విషాదం.

## ట్రంప్ కు కోలేకోలేని దెబ్బ

డెమోక్రట్ మికీ షెరిల్ ట్రంప్ ఎండోర్స్‌మెంట్ పొందిన రిపబ్లికన్ జాక్ సియాటరెల్లిని ఓడించారు. 1961 తర్వాత మొదటిసారి ఒకే పార్టీ మూడు వరుసగా గవర్నర్ పదవులు దక్కించుకుంది. షెరిల్ రెండో మహిళా గవర్నర్‌గా రికార్డు సృష్టించారు. న్యూయార్క్ సిటీ మేయర్ రేసులో డెమోక్రట్ జోరాన్ మమ్దానీ ఇండిపెండెంట్ ఫార్మర్ గవర్నర్ ఆండ్రూ కుమో, రిపబ్లికన్ కర్టిస్ స్లివాను ఓడించి గెలిచారు. ట్రంప్ ఈ ఫలితాలను సోషల్ మీడియాలో తీవ్రంగా విమర్శించారు. న్యూయార్క్ మమ్దానీ విజయాన్ని "డిసాస్టర్" అని, బ్యాలెట్ ప్రాసెస్‌ను "స్కామ్" అని పిలిచారు. ట్రంప్ తన హోమ్ టౌన్‌లో ఈ ఓటమి తీవ్రంగా తీసుకుని, ఫెడరల్ ఫండింగ్ ఉపసంహరించుకుని, సిటీని టేకోవర్ చేస్తానని హెచ్చరించారు. డెమోక్రట్ లీడర్లు ఈ విజయాన్ని "ట్రంప్ అజెండాపై పెద్ద ఓటమి"గా చూస్తున్నారు. మాజీ ప్రెసిడెంట్ బరాక్ ఒబామా భవిష్యత్ వెలుగులు కనిపిస్తున్నాయన్నారు. ఓటర్లు ఎకానమీ, లివింగ్ కాస్ట్‌లు, హౌసింగ్, ఫెడరల్ కట్స్‌పై ఆందోళన వ్యక్తం చేసిన వైనం ఓటింగ్ లో బయటపడింది. వచ్చే ఏడాది అమెరికాలో మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఫలితాల ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుందని ట్రంప్ భయపడుతున్నారు.

## రాహూల్ కు ఈసీ ఘాటూ రిప్లై

ఈసీ ప్రశ్నించింది. గత ఏడాది హర్యానాలో ఎన్నికలు జరిగాయని, వాటికి ముందు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదని తెలిపింది. పోలింగ్ స్టేషన్‌లలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లు ఏం చేస్తున్నారని ప్రశ్నించింది.

**రాహూల్ ఏమన్నాడంటే..**

హర్యానా ఎన్నికల్లో భారీగా అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. బుధవారం ఉదయం 'హైడ్రోజన్ బాంబ్' పేరుతో మీడియాతో లైవ్ ఏర్పాటు చేసి హర్యానా ఎన్నికల్లో అక్రమాలకు సంబంధించిన వివరాలను ప్రదర్శిస్తూ వివరించారు. హర్యానాలోని ప్రతీ ఎనిమిది మంది ఓటర్లలో ఒకరు ఫేక్ ఓటరేనని రాహుల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మొత్తంగా 12.5 శాతం మంది ఫేక్ ఓటర్లు ఉన్నారని తెలిపారు. బ్రెజిల్ కు చెందిన మోడల్ ఒకరు హర్యానా ఎన్నికల్లో సీమ, స్వీటీ, సరస్వతి పేరుతో మూడుసార్లు ఓటేసిందని ఆయన చెప్పారు. ఒకే మహిళ, ఒకే ఫొటోతో వేర్వేరు పోలింగ్ బూత్ లలో వంద ఓట్లు వేసిందన్నారు. రాహుల్ గాంధీ సాక్ష్యాలతో పాటుగా ఈ ఆరోపణలు చేశారు. ఓటర్ జాబితాలోని తప్పులను స్క్రీన్ పై ప్రదర్శిస్తూ.. పోలింగ్ సందర్భంగా బూత్ లెవల్ నుంచే అక్రమాలు జరిగాయని చెప్పారు. ఎలక్షన్ కమిషన్ తలుచుకుంటే ఓటర్ జాబితాలోని ఈ అక్రమాలను కేవలం క్షణాల వ్యవధిలో తొలగించగలదని అన్నారు. అయితే, కేంద్రంలోని బీజేపీకి ఈసీ వంతపాడుతూ అక్రమాలకు కొమ్ముకాస్తోందని రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవల హర్యానాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 25 లక్షల ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించారు. ఓటు హక్కు నమోదుకు హౌస్ నెంబర్ తప్పనిసరి కావడంతో ఇళ్లు లేని నిరుపేదలకు ఇబ్బంది కలుగుతోందని ఈసీ ఓ కొత్త రూల్ తీసుకొచ్చిందని రాహుల్ గుర్తుచేశారు. ఈ విధానం వెనక నిరుపేదలకు ఓటు హక్కు కల్పించాలనే సదుద్దేశం కన్నా అక్రమ ఓటర్లు, ఫేక్ ఓటర్లకు జాబితాలో చోటు కల్పించాలనే దురుద్దేశమే ఉందని రాహుల్ విమర్శించారు. ఎన్నికల జాబితాలో ఇంటి నెంబర్ జీరోగా పేర్కొన్న పలు ఓటర్ల ఇళ్లను తన టీమ్ ప్రత్యక్షంగా వెళ్లి పరిశీలించిందని ఆయన తెలిపారు. ఇంటి నెంబర్ జీరోగా పేర్కొన్న ఓ నిరుపేద ఇల్లు ఇదేనంటూ స్క్రీన్ పై ఓ భారీ భవంతిని చూపించారు. ఇంత పెద్ద భవనానికి ఇంటి నెంబర్ లేదని, ఈ ఇంటి యజమాని పేరు సహా పలువురు అక్రమార్కులకు ఇదే విధంగా ఓటు హక్కు కల్పించారని రాహుల్ గాంధీ ఆరోపించారు.

# దిగొస్తున్న అగ్రరాజ్యం

రాబోయే పదేళ్లలో రక్షణ రంగంలో సహకారం పెంపొందించుకోవడానికి వీలైన మౌలిక విధానంపై భారత్, అమెరికా మధ్య ఒక ఒప్పందం కుదిరింది. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సేత్, భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మధ్య కౌలాలంపుర్‌లో జరిగిన సమావేశం తర్వాత ఈ ఒప్పందాన్ని ప్రకటించారు. 'ఈ ఒప్పందం సమన్వయం, సమాచార మార్పిడి, సాంకేతిక సహకారాన్ని పెంపొందిస్తుంది.



**జయభేరి, హైదరాబాద్ :**

ప్రాంతీయ స్థిరత్వాన్ని పెంచుతుంది. సంఘర్షణలు పెరగకుండా నివారిస్తుంది' అని పీట్ హెగ్సేత్ ఎక్స్‌లో రాశారు. అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్, భారత్‌పై 50 శాతం సుంకాలు విధించాక, ఉద్రిక్తంగా మారిన సంబంధాలను చక్కదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నవేళ, రెండుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి తుదిరూపు ఇచ్చే ప్రయత్నాల్లో ఉన్న సమయంలో ఈ ఒప్పందం కుదిరింది. ట్రంప్ టారిఫ్‌లలో రష్యా నుంచి చమురు, ఆయుధాలు కొనుగోలు చేసినందుకు జరిమానాగా విధించిన 25 శాతం కూడా కలిసి ఉంది. 'ఇప్పటికే బలంగా ఉన్న మన రక్షణ భాగస్వామ్యంలో ఈ ఒప్పందం ఒక కొత్త శకానికి నాంది పలుకుతుంది. ద్వైపాక్షిక సంబంధాల్లో రక్షణ అనేది మూల స్తంభంగా ఉంటుంది. స్వేచ్ఛాయుత, బహిరంగ, నియమ నిబంధనలకు కట్టుబడి ఉండే ఇండోపసిఫిక్ ప్రాంతాన్ని సురక్షితంగా మార్చడానికి ఈ ఒప్పందం చాలా ముఖ్యం' అంటూ భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ ఒప్పందం గురించి సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రెండు దేశాల మధ్య టారిఫ్ వివాదాల ప్రభావం గురించి యురేషియా గ్రూప్ థింక్ ట్యాంక్ ప్రమిత్ పాల్ చౌధరీని బీబీసీ ప్రతినిధి షెర్లిన్ మోలాన్ ప్రశ్నించారు. 'ఈ ఒప్పందం ఈ ఏడాది జులైఆగస్టులో పూర్తి కావాల్సింది. కానీ, పాకిస్తాన్‌తో సంఘర్షణను ముగించానంటూ ట్రంప్ చేసిన ప్రకటనలపై భారత్ అసంతృప్తి చెందడం వల్ల అది ఆలస్యమైంది' అని ప్రమిత్ పాల్ అన్నారు. రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందాల శ్రేణిలో ఇది తాజా ఒప్పందమని ప్రమిత్ పాల్ వ్యాఖ్యానించారు. 'ఈ ఒప్పందం రెండు దేశాల సైన్యాల మధ్య సమన్వయాన్ని పెంచుతుంది. భారత్‌కు సాంకేతికత అందుబాటులోకి వస్తుంది. రక్షణ రంగంలో రెండు దేశాల సైన్యాలు కలిసి పని చేయడం సులభమవుతుంది' అని ఆయన అన్నారు. ఇటీవలి కాలంలో భారత్, అమెరికా తమ రక్షణ సంబంధాలను బలోపేతం చేస్తున్నాయి.
ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోదీ అమెరికాలో పర్యటించారు. ట్రంప్‌తో జరిగిన చర్చల్లో రక్షణ అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. భారత్‌కు సైనిక సామగ్రి విక్రయాలను అనేక బిలియన్ డాలర్లకు పెంచుతానని, దీంతో భారత్‌కు ఎఫ్35 స్టెల్త్ యుద్ధ విమానాలు లభించే మార్గం తెరుచుకుంటుందని ట్రంప్ అన్నారు. కానీ అప్పటి నుంచి, రష్యా నుంచి చౌకగా భారత్ చమురును కొనడం, రష్యాతో భారత్‌కు ఉన్న దీర్ఘకాల రక్షణ సంబంధాలు ట్రంప్ ప్రభుత్వానికి ఆందోళన కలిగించే అంశాలుగా మారాయి. రెండు దేశాల మధ్య కుదిరిన ఈ ఒప్పందం ఎంత ముఖ్యమైనదని సనా హష్మీని ఆయన అడిగారు. 'ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న. ట్రంప్ ట్వీట్లకు, ఆయన సోషల్ మీడియా కార్యకలాపాలకు మనం చాలా ప్రాముఖ్యం ఇస్తున్నామని అనుకుంటున్నా. వీటి ఆధారంగానే మనం భారత్‌అమెరికా సంబంధాలను అంచనా వేస్తున్నాం. రెండు దేశాల మధ్య సంబంధాల్లో చీలిక ఏర్పడిందని చెబుతున్నాం. ఎవరైనా ఒక నాయకుడి మూలంగా ఒక రెండు దేశాల సంబంధాలు పెద్దగా ప్రభావితం కావు. ట్రంప్ పదవీకాలం ముగిసిన తర్వాత ఇప్పుడున్న పరిస్థితి మారుతుంది' అని సనా హష్మీ అభిప్రాయపడ్డారు. దక్షిణ కొరియాలో డోనల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సమావేశమయ్యారు. చైనాపై విధించిన 'ఫెంటానిల్ టారిఫ్'లను కుదిస్తున్నట్లు ఆ సమావేశం తర్వాత ట్రంప్ ప్రకటించారు. ట్రంప్ షీ జిన్‌పింగ్ కలుసుకున్నప్పటికీ వారిద్దరి మధ్య సంబంధాలు సానుకూల దిశలో వెళ్తున్నాయని మనం చెప్పలేం. చైనాను ఎదుర్కోవడానికి అమెరికాకు భారత్ సహాయం చాలా అవసరం. ఇప్పటికీ అమెరికా దృష్టిలో భారత్ ప్రాధాన్యం చెక్కుచెదరకుండా అలాగే ఉంది. భారత్ పట్ల అమెరికా ఇప్పటికీ సానుకూలంగా ఉందని చెప్పడానికి తాజాగా కుదిరిన ఈ ఒప్పందమే నిదర్శనం. సుంకాల వివాదం, రష్యాతో భారత్ సంబంధాల తర్వాత కూడా భారత్‌తో అమెరికా ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ట్రంప్ ఏం చెప్పినా రెండు దేశాల మధ్య రక్షణ సంబంధాలు పెరుగుతూనే ఉంటాయి. ఈ ఒప్పందం భారత్ కంటే అమెరికాకే చాలా ముఖ్యమని భావిస్తున్నా' అని సనా హష్మీ అన్నారు. రష్యా ఇప్పటికీ భారత్‌కు ప్రధాన ఆయుధ సరఫరాదారుగా ఉంది. అయితే, భారత్ ఆయుధాల్లో వైవిధ్యాన్ని, దేశీయ సామర్థ్యాన్ని పెంచడానికి ప్రయత్నిస్తున్నందున భారత రక్షణ కొనుగోళ్లలో రష్యా వాటా క్రమంగా తగ్గుతోంది. అమెరికా నుంచి చమురు, రక్షణ కొనుగోళ్లను పెంచడానికి సిద్ధంగా ఉన్నట్లు భారత్ ఇటీవల సంకేతాలు ఇచ్చింది.
ప్రస్తుతం భారత్, అమెరికా అత్యంత కీలకమైన వాణిజ్య ఒప్పందంలో నిమగ్నమై ఉన్నాయి. నవంబర్‌లో ఒక ఒప్పందానికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. చాలా కాలంగా దీనికోసం ఎదురుచూస్తున్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసినందుకు 'శిక్ష'గా అభివర్ణిస్తూ ఈ ఏడాది ఆగస్టులో భారత దిగుమతులపై అమెరికా 50% సుంకం విధించింది. భారత్ ఈ విషయంలో జాగ్రత్తగా స్పందించింది. దేశీయ వినియోగదారుల ప్రయోజనాల కోసమే చమురు కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ అతి త్వరలో గణనీయంగా తగ్గిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ తనతో చెప్పారని ఇటీవలి కాలంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనేక సార్లు అన్నారు. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు. నిరుడు రష్యా నుంచి 52.7 బిలియన్ డాలర్ల విలువైన ముడి చమురును కొనుగోలు చేసింది.



## 4 గంటల్లో 2 వేల సమస్యలు

నాలుగు గంటల పాటు దాదాపు 4 వేలమందికి పైగా కలిసి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ప్రతి విజ్ఞప్తిని పరిశీలించి సిబ్బందికి అప్పటికప్పుడే ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వంలో అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తన భూమిని బలవంతంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఇచ్ఛాపురం మండలం బుద్దేపు పేట గ్రామానికి చెందిన దనపాన హరికృష్ణ మంత్రి నారా లోకేష్ ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. తనకు వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూమిని తప్పుడు పత్రాలతో కబ్జా చేసేందుకు వైసీపీ కార్యకర్త యత్నిస్తున్నారని గుంటూరు జిల్లా కాకుమాను గ్రామానికి చెందిన రవిబాబు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గెస్ట్ లెక్చరర్ గాపని చేస్తున్న తనను వైసీపీ హయాంలో విధుల నుంచి తొలగించారని, తిరిగి తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన ఉలిద్ర రవి మంత్రి నారా లోకేష్ ను కలిసి విన్నవించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలోని పారామెడికల్ విభాగంలో ఖాళీగా ఉన్న హెల్త్ అసిస్టెంట్ మేల్ పోస్టుల భర్తీకి తగిన చర్యలు తీసుకోవాలని అన్ ఎంప్లాయిస్ పారా మెడికల్ హెల్త్ అసిస్టెంట్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. టీడీపీ పాలనలో ఎంపీహెచ్ ఏ మేల్ పోస్టులను భర్తీ చేశారు. గత కొన్నేళ్లుగా హెల్త్ అసిస్టెంట్ మేల్ పోస్టులకు సంబంధించి ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. శ్రీశైలం ఐటీడీఏ (పీటీజీ) చెంచు ప్రాజెక్ట్ కార్యాలయం పరిధిలోని ప్రకాశం జిల్లా అటవీ ప్రాంతంలోని గిరిజన చెంచు, ఆదివాసి గూడెంల్లో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నూతన పాఠశాలల మంజూరుకు తగిన చర్యలు తీసుకోవాలని నల్లమల గిరిజన చెంచు (పీటీజీ) సంక్షేమ సంఘం ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఏపీ జెన్ కో, ట్రాన్స్ కో, డిస్కమ్స్ లో పనిచేస్తున్న సుమారు 23,500 మంది కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. వేతన సవరణ చేయడంతో పాటు ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి తీవ్ర అనారోగ్యం పాలైన తనకు సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్యసాయం అందించి ఆదుకోవాలని చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం మండలం కన్నికాపురం గ్రామానికి చెందిన కె.ప్రకాశ్ బాబు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలంలో సైన్స్, ఆర్ట్స్, ఒకేషనల్ కోర్సులతో కూడిన ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతానికి చెందిన బి.ఎమ్ కిషోర్ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదివేందుకు విద్యార్థులు సుదూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, దీంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ కొత్తూరు తాడేపల్లిలో విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన గరిమెళ్ల అనిల్ కుమార్ మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. విజయవాడవిసన్నపేట ఆర్ అండ్ బీ రోడ్డును ఆక్రమించి ఆక్రమణదారులు భారీ కట్టడాలు నిర్మిస్తున్నారని, అక్రమ నిర్మాణాలు తొలగించాలని అధికారులకు పలుమార్లు ఫిర్యాదుచేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలన్నింటినీ సమీక్షించేందుకు ప్రత్యేకంగా అధికారుల టీమ్ ను ఏర్పాటు చేస్తున్నారు.

## కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు తాకిడి



**మేడ్చల్:**

కీసర గుట్టలో ప్రసిద్ధిగాంచిన దేవాలయం, స్వయంభూగా వెలిసిన శ్రీ భవాని శివదుర్గ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయానికి వేకువజామునే భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆ పరమ శివుడిని భక్తులు దర్శించుకుని, స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వెలుపల కొలువైన శివలింగాలకు మహిళలు పాలాభిషేకం చేసారు. ఆలయంలో మహిళలు కుటుంబ సమేతంగా కార్తీక దీపాలు వెలిగించి తమ మొక్కలు చెల్లించుకున్నారు. స్వామి వారిని దర్శించుకునే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ, కార్యనిర్వహణ అధికారి కట్ట సుధాకర్ రెడ్డి తెలిపారు.

# యాదగిరిగుట్టలో కార్తీక పౌర్ణమి సందడి

జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 05:



కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి క్షేత్రంలో కార్తీక పౌర్ణమి సందడి నెలకొంది. స్వామి వారి క్షేత్రంలోని ఆలయ మాడా వీధులు పూర్తిగా కార్తీక పూజలు నిర్వహించే భక్తులతో పెద్ద ఎత్తున సందడిగా మారాయి. ఈ సందర్భంగా వ్రత మండపంలో భక్తులు సత్యనారాయణ స్వామికి పూజలు నిర్వహించారు. దీపారాధన మండపంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక పూజలు జరిపించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.సత్యనారాయణ స్వామి వ్రతాలు,నిజాభిషేకం, కార్తీక దీపాలు వెలిగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పండుగ నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారి క్షేత్రానికి పోటెత్తారు. దీంతో ఆలయ మాడవీధులు, శివాలయం,వ్రత మండపాలు, కార్తీక దీపారాధన ప్రదేశాలు భక్తులతో కిటకిటలాడాయి.

**శ్రీ నారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా ఆదివారం రూ.50,02,889 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.2,35,900, బ్రేక్ దర్శనం ద్వారా రూ.2,05,500, వీఐపీ దర్శనం ద్వారా రూ.3,75,000, శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజల ద్వారా రూ.19,64,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.3,18,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.69,600, ప్రసాద విక్రయం ద్వారా రూ.10,51,185, కల్యాణకట్ట ద్వారా రూ.51,500తో పాటు వివిధ శాఖ, పాతగుట్ట ఆలయం ద్వారా ఆలయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.





## వ్యవసాయ యాంత్రీకరణకు ఇంకా ఎక్కువ అవకాశాలు

జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 05:

తెలంగాణ రాష్ట్రంలోని జాన్ డీర్ ట్రాక్టర్ల అమ్మకాలు లక్షా యాభై వేలు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్తీక పౌర్ణమి రోజున తెలంగాణ జాన్ డీర్ డీలర్లు యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి ఒక జాన్ డీర్ 5042D ట్రాక్టర్, ట్రాక్టర్ ట్రాలీని బహుకరించారు. ఈ సందర్భంగా డీలర్లు ప్రతినిధులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని జాన్ డీర్ 5042D అన్నిటికంటే ఎక్కువగా విక్రయించబడే ట్రాక్టర్ మోడల్ అని, తెలంగాణ రాష్ట్రంలోని జాన్ డీర్ నెంబర్ 1 స్థానంతో ఉందని తెలిపారు. కస్టమర్ల సర్వీస్ స్పేర్ పార్ట్స్ కోసం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 130 పైగా షోరూమ్‌లు, వర్క్‌షాప్‌లు ప్రతి 30 కిలోమీటర్లకు అందుబాటులో ఉన్నాయని, వీటి ద్వారా మూడు వేల మందికి పైగా ఉద్యోగం చేస్తున్నారని చెప్పారు. జాన్ డీర్ ట్రాక్టర్ క్వాలిటీకి ఎక్కువ మంది ఆదరిస్తున్నారని, ఫోర్ వీల్ డ్రైవ్, రోటరీ టిల్లర్ తో మొదలు GPS తో కూడా నడిచే అధునాతన ఏ.సి కేబిన్ ట్రాక్టర్లు తెలంగాణలో వ్యవసాయాన్ని ముందుకు తీసుకు వెళ్ళటానికి కావలసిన టెక్నాలజీ ట్రాక్టర్లు, యంత్రాలు జాన్ డీర్ లో అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలోని వ్యవసాయ యాంత్రీకరణకు ఇంకా ఎక్కువ అవకాశాలు ఉన్నాయి, వాటిని గుర్తుంచి రైతులు నాణ్యమైన ఉత్పాదనలు ద్వారా ఆదాయం పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఆలయ ఇంచార్జి ఈవో రవి నాయక్,తెలంగాణ డీలర్లు రాజేంద్రప్రసాద్,శేఖర్, గోపాల్ రెడ్డి,సుదర్శన్ రెడ్డి రాజేష్ యాదవ్,రాజేశం, కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## శివపార్వతుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

జయభేరి, పరవాడ:

పరవాడ గ్రామంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో కార్తీక మాస కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు,అభిషేకాలు నిర్వహించారు తరువాత శివపార్వతుల ఉత్సవ విగ్రాహాలను గ్రామ పురా వీధిలలో ఘనంగా ఊరేగించారు తధాఅనంతరం ఆలయం వద్ద జ్వాలా తోరణం వెలిగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అయ్యప్పా స్వాములు, భక్తులు,ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి పరిధిలో లభించిన 20 ఎర్రచందనం దుంగలు

- తొమ్మిది మంది స్మగ్లర్లు అరెస్ట్

జయభేరి, తిరుపతి:

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి అటవీ పరిధిలో 20ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, 9మంది స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ శ్రీ ఎల్. సుబ్బారాయుడు గారి కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీ పీ. శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో డీఎస్పీ శ్రీ ఎండీ షరీఫ్ మార్గ నిర్దేశకత్వంలో ఆర్ఐ సాయి గిరిధర్ కు చెందిన ఏఆర్ఎస్ఐ ఎన్. ఈశ్వర రెడ్డి టీమ్ శ్రీకాళహస్తి అటవీ పరిధిలో కూంబింగ్ చేపట్టింది. వీరు బుధవారం తెల్లవారుజామున రాగిగుంట సెక్షన్, తీర్థాలపాల కోనకు చేరుకున్నారు. అక్కడ కొంతమంది వ్యక్తులు గుమికూడి కనిపించారు. వారిని సమీపించడంతో పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. వెంబడించిన టాస్క్ ఫోర్స్ టీమ్ చుట్టుముట్టి 9మందిని పట్టుకున్నారు. చుట్టుపక్కల పరిశీలించగా 20 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిలో ఇద్దరు తిరుపతి జిల్లాకు చెందిన వారు కాగా, ఏడుగురు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు. వీరిని దుంగలతో సహా తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. డీఎస్పీ వీ శ్రీనివాసరెడ్డి, ఏసీఎఫ్ జె శ్రీనివాస్ వీరిని విచారించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రూ.400 కోట్ల బంగారం కొనుగోలు చేసిన జగన్

జయభేరి, అమరావతి:

మాజీ సీఎం జగన్ పై ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగం, రాజ్యం తనదే అన్నట్లు జగన్ వ్యవహరించారని, భారతీరెడ్డి కోసం రూ.400 కోట్ల బంగారం కొనుగోలు చేశారని తెలిపారు. లిక్కర్ కేసులో ఈడీ సోదాలు చేయగా.. భారీ ఎత్తున బంగారం కొనుగోలు చేసినట్టు బయటపడిందన్నారు. జగన్కు త్వరలో చెక్ పెట్టబోతున్నామని, లిక్కర్ కేసులో అవినాష్ రెడ్డి అరెస్టు ఖాయమన్నారు.



# కుంకుమేశ్వర ఆలయంలో ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

- కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించిన అర్చకులు
- ఆలయ ఆవరణలో మాహా అన్నదాన కార్యక్రమం నిర్వహణ

జయభేరి, పరకాల, నవంబర్ 05:



కార్తీక్ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించిన పరకాలలోని ప్రసిద్ధ దేవస్థానమైన శ్రీ కుంకుమేశ్వర ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు కోమాళ్ళపల్లి నాగభూషణ శర్మ బ్రహ్మశ్రీ సంపత్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో బుధవారం ఉదయము 5 గంటల నుండి కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఆలయంలొ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి దర్శనం ఆచరించి ఆలయ ప్రాంగణంలోని స్వామి వారికి అభిషేకాలు, కుంకుమ పూజలు వ్రతాలను చేయడం జరిగింది.

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో అర్చకులు నాగభూషణ శర్మ ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి వ్రతమును ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో కొత్తూరు నాగేశ్వరరావు దంపతుల చేతులు మీదుగా మహా అన్నదాన కార్యక్రమమును నిర్వహించడం జరిగింది. దేవాలయాల్లో కార్తీక దీపోత్సవాల్లో భాగంగా ఆకాశ దీపోత్సవ కార్యక్రమమును అంగరంగ వైభవంగా నిర్వహించిన్నారు.



ఆలయ ప్రాంగణంలో భక్తుల సమక్షంలో ఆలయ కమిటీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు మహా రుద్ర యాగ సమితి అధ్యక్షులు పరకాల పట్టణ భక్త మహాశయులను ఉద్దేశించి మాట్లాడుతూ.. నవంబర్ 17వ తేదీ సోమవారం కార్తీక మాస మహా రుద్రయాగమును పరకాల లోని కుంకుమేశ్వర ఆలయనికి సంబంధించిన పశువుల సంత ఆవరణలో ఏర్పాటు చేయబడ్డ యజ్ఞశాల యందు మహా రుద్ర యాగమును ఘనంగా నిర్వహించుటకు ఏర్పాటు చేయడమైనది ఇట్టి యాగానికి హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరడమైనది.

# గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉంది
- గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి
- ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి

జయభేరి, పరకాల, నవంబర్ 05:



బుధవారం పరకాల నియోజకవర్గంలోని గీసుగోండ మండలంలోని వంచనగిరి, శాయంపేట, ఊకల్, మచ్చాపూర్, ఎలుకుర్తి హవేలీ, మనుగోండ, గీసుగోండ గ్రామాలలో సిఆర్ ఆర్ఎస్సి సబ్ ప్లాన్ నిధులతో ఎస్సీ కాలనీలలో చేపట్టిన 1కోటి 57 లక్షల73వేల సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, ముఖ్యంగా ఎస్సీ కాలనీలలో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని తెలిపారు. పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని, ఇది ప్రజల ప్రభుత్వం అని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు అభివృద్ధి పేరుతో దోచుకున్నారని, ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా పరకాలలో డైరీ ని ఏర్పాటు చేయబోతున్నామన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు రూ 500 బోనస్, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ, వడ్డీ లేని రుణాలు, శ్రీనిధి రుణాలు, ఇందిరమ్మ ఇల్లు, సీఎంఆర్ఎఫ్ కళ్యాణ లక్ష్మి, తదితర సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అందజేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## స్కూల్ గేమ్స్ పోటీలకు పాల్గొన్న సంస్కృతి గ్లోబల్ విద్యార్థులు



జయభేరి, పరవాడ:

జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి క్రీడా పోటీలలో పాల్గొని రికార్డు స్థాయిలో ఒకే విద్యాసంస్థ నుండి అత్యధికంగా రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు సంస్కృతి గ్లోబల్ స్కూల్ ఆర్చరీ,బాక్సింగ్, బాడ్మింటన్, బేస్ బాల్, చెస్, మోడరన్ పెంటాథ్లాన్, షూటింగ్, స్విమ్మింగ్, సాఫ్ట్ బాల్, వుషు క్రీడలలో ప్రతిభ కనబర్చి ఎంపికైన 65 మంది అండర్ 19, 17, 14 సంస్కృతి గ్లోబల్ స్కూల్ క్రీడాకారులను సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి అభినందనలు తెలిపారు.ఈ క్రీడాకారులతో పాటు ఈ క్రీడలలో శిక్షణ ఇచ్చిన నిష్ణాతులైన క్రీడాశిక్షకులు గోవింద్, శివకుమార్, హరినాథ్ రెడ్డి, రాజేష్ కుమార్, రామ్మోహన్, లోహిత్, రమ్య, నవీన్, దినేష్, అమర్నాథ్, అన్నపూర్ణ లను పాఠశాల సీ ఈ ఓ కె. నిశాంత్ అభినందనలు తెలుపుతూ రాష్ట్ర స్థాయి పోటీలలో రాణించి జాతీయ స్థాయి లో పాల్గొనాలని ఆకాంక్షించారు.

## కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక హోమం

- కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా భోళా శంకరుడైన ఆ పరమశివుడు ప్రజలందరికి సకల సౌభాగ్యాలు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రత్యేక హోమం నిర్వహించిన కేతావత్ భిల్యా నాయక్



జయభేరి, దేవరకొండ :

బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్ కార్తిక పౌర్ణమి సందర్భంగా హైదరాబాద్ లోని BN రెడ్డి నగర్ టీచర్స్ కాలని లోని తన స్వగృహంలో హోమం,సత్యనారాయణ స్వామి వ్రతం చేయడం జరిగింది అనంతరం వారు మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఆనందం మెలగాలని .ఆ పరమేశ్వరుని ఆశీస్సులు మన పై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు.

## శ్రీశైలం ఘాట్ రోడ్డులో అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు.. ప్రయాణికులు క్షేమం

జయభేరి, అచ్చంపేట, నవంబర్ 5:

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం పెద్ద ప్రమాదం తప్పింది. శ్రీశైలం వైపు వెళ్తున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు అక్కమ దేవి ఘాట్ రోడ్డులోని కఠిన మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డుపై అడ్డంగా తిరిగిపోయింది.వివరాల్లోకి వెళితే... హైదరాబాద్ నుండి శ్రీశైలం దిశగా బయలుదేరిన బస్సు వేగం ఎక్కువగా ఉండటంతో అక్కమ దేవి మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. బస్సు రోడ్డుపై అడ్డంగా తిరిగిపోవడంతో ఘాట్ రహదారిపై రెండు గంటలకు పైగా భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.సమాచారం అందుకున్న పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.అదృష్టవశాత్తూ బస్సులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురైనా చివరికి ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

# కళ్యాణలక్ష్మిలో అక్రమాలు




✍ జయభేరి, హైదరాబాద్, నవంబర్ 5:

పేదింటి ఆడబిడ్డల పెళ్లికి ఆర్థిక సాయం అందించేందుకు గత ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి పథకాన్ని తీసుకువచ్చింది. అయితే ఈ పథకం అమలులో అనేక అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. నకిలీ సర్టిఫికెట్లతో కొందరు దళారులు పథకాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. పెళ్లైన 15 ఏళ్ల తర్వాత కూడా చెక్కులు రావడం, ఒకే అమ్మాయికి రెండుసార్లు చెక్కులు రావడం వంటి ఘటనలు మహబూబ్‌నగర్‌లో కలకలం రేపుతున్నాయి. విషయం తెలుసుకున్న అధికారులు చెక్కులు వెనక్కి తీసుకున్నారు. ఆ వివరాలు..పేదింటి ఆడబిడ్డ వివాహం తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకుడదనే ఉద్దేశంతో గత ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి పథకాన్ని తీసుకువచ్చింది. 18 ఏళ్లు నిండిన పేదింటి ఆడబిడ్డ వివాహం సందర్భంగా ప్రభుత్వం అక్షరాల లక్షా పదహారు రూపాయల (రూ.1,00,116) సాయం అందిస్తుంది. ఇది పేద కుటుంబాలకు ఎంతో ఆసరాగా నిలుస్తుంది. వివాహం అయిన తర్వాత సంబంధిత డాక్యుమెంట్లు సమర్పించి.. కళ్యాణ లక్ష్మి పథకానికి అప్లై చేసుకోవాలి. అయితే కొందరు దళారులు, కేటుగాళ్లు నకిలీ సర్టిఫికెట్లతో పథకాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. తాజాగా మహబూబ్‌నగర్ ఈ తరహా సంఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. పెళ్లైన 15 ఏళ్ల తర్వాత కళ్యాణి లక్ష్మి చెక్కు రావడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. నకిలీ సర్టిఫికెట్లతో కళ్యాణ లక్ష్మి చెక్కులు పొందడానికి ప్రయత్నించిన దళారుల వ్యవహారం తెర మీదకు వచ్చింది. మూడు రోజుల క్రితం ప్రభుత్వం మహబూబ్‌నగర్ జిల్లా ఊట్కూరు మండలంలో కొందరికి కళ్యాణ లక్ష్మి చెక్కులు విడుదల చేసింది. అయితే వీటిలో మూడు చెక్కులు మిగిలిపోవడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. ఊట్కూరు గ్రామానికి చెందిన ఓ మహిళకు 15 సంవత్సరాల క్రితమే వివాహం అయ్యింది. కానీ దళారులు నకిలీ సర్టిఫికెట్లతో.. ఆ మహిళ పేరు మీద కళ్యాణ లక్ష్మికి దరఖాస్తు చేశారు. తాజాగా ఆమెకు చెక్కు మంజూరైంది. విషయం తెలిసిన సదరు మహిళ ఆశ్చర్యపోయింది. మరో మహిళకు కూడా ఇలానే కళ్యాణ లక్ష్మి చెక్కు వచ్చింది. ఆమె దాన్ని బ్యాంకులో జమ చేసింది. అయితే ఈ మోసం గురించి తెలుసుకున్న రెవెన్యూ అధికారులు.. ఆ ఖాతాను హోల్డ్‌లో పెట్టారు.ఊట్కూరు మండలంలోని మరో గ్రామంలో కూడా ఇదే తరహా మోసం వెలుగులోకి వచ్చింది. పెద్దజట్రం గ్రామానికి చెందిన ఎం లింగమ్మకు మూడు సంవత్సరాల క్రితం వివాహం అయ్యిది. మద్దెల్‌బీడు గ్రామానికి చెందిన యువకుడితో.. లింగమ్మ తల్లి దండ్రులైన సిద్రామప్ప, ఈరమ్మ దంపతులు ఆమె వివాహం జరిపించారు. వివాహం అయిన కొన్ని రోజులకే.. లింగమ్మకు కళ్యాణ లక్ష్మి చెక్కు వచ్చింది. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి లింగమ్మకు కళ్యాణ లక్ష్మి చెక్కు అందజేశారు.తాజాగా కొందరు కేటుగాళ్లు.. నకిలీ పత్రాలతో 2024KL301286711 నంబరు మీద మళ్లీ కళ్యాణ లక్ష్మికి అప్లై చేశారు. దీంతో అక్టోబర్ 22న ఇచ్చిన కళ్యాణ లక్ష్మి జాబితాలో లింగమ్మ పేరు మళ్లీ వచ్చింది. అయితే ఆమె తల్లి పేరు స్థానంలో మరో మహిళ పేరుతో చెక్కు జారీ మంజూరు చేశారు. చెక్కులో లింగమ్మ తల్లి పేరు స్థానంలో ఉన్న మహిళకు అసలు కుమార్తెలే లేరు. అలాంటి ఆమె పేరు మీద చెక్కు రావడం స్థానికంగా కలకలం రేపుతోంది .ఈ విషయం తెలుసుకున్న అధికారులు.. సిబ్బందిని గ్రామానికి పంపించి.. ఈ చెక్కుల గురించి విచారించారు. అనర్హులు ఉన్నారని తేలటంతో.. ఆ చెక్కులను తిరిగి అధికారుల వద్దకు పంపారు. తప్పుడు పత్రాలతో దరఖాస్తు చేసుకున్న దళారులపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.



## శ్రమజీవుల హక్కులకై కలబడిన ధర్మానాయక్

✍ జయభేరి, గార్ల, నవంబర్ 5:

శ్రమజీవులలో చైతన్యం కలిగించి, వారి హక్కులకై కలబడి నిలబడిన ప్రజా నాయకుడు ధర్మానాయక్ అని తెలంగాణ గిరిజన సంఘం మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య హరినాయక్ అన్నారు. అమరుడు సిపిఎం సీనియర్ నాయకులు ధర్మానాయక్ రెండవ వర్ధంతి సభను ముత్తితండా గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరినాయక్ మాట్లాడుతూ, గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, తండాల సమగ్ర అభివృద్ధి కొరకు గ్రామపంచాయతీలుగా గుర్తించాలని పోరాడిన ప్రజా నాయకుడు ధర్మానాయక్ అని కొనియాడారు. మైదాన ప్రాంతంలో గిరిజనుల అభివృద్ధి కొరకు ఐటీడీఏలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బలమైన గిరిజన ఉద్యమాన్ని నిర్మించారు. జీవితాంతం గిరిజనులు, పేద ప్రజల హక్కుల కోసం పోరాడిన అమరజీవి ధర్మానాయక్ కన్న కలలను సాకారం చేయాలని ఆయన ఆశయ సాధనకై యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పూల్ సింగ్, ధరావత్ వీరన్న, బి.నరేష్, భద్రు, లక్ష్మి, పూరి, మంగి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణను యువత సద్వినియోగ పరచుకోవాలి



✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణంలో విలేజ్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత జనరల్ డ్యూటీ నర్స్ అసిస్టెంట్ శిక్షణ కేంద్రాన్ని అర్హత గల వారు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మంగ్త నాయక్ తెలిపారు. బుధవారం పట్టణంలోని విలేజ్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ఎస్ ఎస్ వి వై వారి ఆర్థిక సహకారంతో వీడిఎస్ కార్యాలయంలో ఉత్తమ సర్వీస్ సొసైటీ జాతీయ అవార్డు గ్రహీత లావుడి బాషాతో కలిసి ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ ప్రారంభానికి డాక్టర్ మంగ్త నాయక్ తో పాటు, డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ క్రాంతి కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పట్టణ, పరిసర ప్రాంత యువతకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత కుట్టుమిషన్, బ్యూటీషియన్, నర్సింగ్, కంప్యూటర్ శిక్షణల కేంద్రాన్ని నడపడం శుభ పరిమాణం అని అన్నారు. శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మరిన్ని వివరాలకు 9963970775 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు వీడిఎస్ సిబ్బంది నిహారిక, రవి, శాంతి, కవిత, తదితరులు పాల్గొన్నారు.




## ఓటర్లను ఆకట్టుకొని కార్యక్రమాలు చేపట్టాలి



✍ జయభేరి, హైదరాబాద్ :

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదేశాల మేరకు నవంబర్ 9వ తేదీ వరకు ప్రచారానికి సంబంధించిన ఏర్పాట్లపై సోమాజిగూడ డివిజన్‌లోని శ్రీనగర్ కాలనీలో మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి నివాసంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఓటర్లను ఆకట్టుకొని కార్యక్రమాలు చేపట్టాలని రూట్ మ్యాప్, కెసిఆర్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ఓటర్లను కలిసి ఓటు అభ్యర్థించడం, ప్రచార కార్యక్రమాలు, సమన్వయం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించి, ఈ కార్యక్రమాలు జయప్రదం చేయాలని నిర్ణయించాము. ఈ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, కార్పొరేటర్లు, BRS పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కుక్క దాడిలో బాలుడికి గాయాలు

✍ జయభేరి, నిర్మల్:

నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని హజ్గుల్ గ్రామంలో ఓ కుక్క దాడిలో రుద్రాన్స్ అనే బాలుడు గాయపడ్డాడు. మంగళవారం సాయంత్రం పాఠశాలలకు నుండి ఇంటికి వచ్చిన బాలుడు తమ ఇంటి సమీపంలో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో కుక్క ఒక్కసారిగా రుద్రాన్స్ పై దాడి చేయగా అరుపులు వేశాడు. ఇది గమనించిన స్థానికులు కుక్కను తరిమివేయడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. బాలుడిని కుటుంబీకులు భైంసా ఏరియా హాస్పిటల్ కు తీసుకొచ్చి చికిత్సలు చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కుక్కల భారి నుండి తమను కాపాడాలని అధికారులను కోరుతున్నారు..

## దాతల సహకారం మరువలేనిది

- వనవాసీ నిలయ కమిటీ అధ్యక్షుడు పాపారావు

✍ జయభేరి, చర్ల, నవంబర్ 5 :




ఆదివాసీ విద్యార్థుల చదువులను ప్రోత్సహించేందుకు ముందుకు వస్తున్న దాతల సహకారం మరువలేనిదని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్ధి నిలయం అధ్యక్షులు తాటి పాపారావు అన్నారు. మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన రైతు కొత్తపల్లి వెంకట్రావు వీరాజమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు, కోడలు కొత్తపల్లి సుభాష్ చంద్రబోస్ నాగమణి దంపతులు కొమరం భీం విద్యార్థి నిలయంకు 50 కేజీల బియ్యం వితరణగా అందచేసారు.


ఈ సందర్భంగా గొంది శోభన్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాపారావు మాట్లాడారు. ఆదివాసీ విద్యార్థుల ఉన్నతికి దాతలు సహాయ సహకారాలను అందించడం ఒక ఆదివాసీగా గర్విస్తున్నానని పేర్కొన్నారు. వనవాసీ కళ్యాణ పరిషత్ ఆదివాసీలకు విద్య, వైద్యం అందచేస్తూ వారి అభ్యున్నతికి పాటు పడుతోందని వెల్లడించారు. మారుమూల గ్రామాలు, కనీస మౌలిక సదుపాయాలు లేని గ్రామాలకు చెందిన ఇక్కడి విద్యార్థులు చదువులతో పాటు ఆటపాటలలో ముందుండటం హర్షనీయమని అన్నారు. శుభ, అశుభ కార్యక్రమాలు జన్మదినంల సందర్భంగా ఆడంబరాలకు పోయి డబ్బు వృదాగా ఖర్చు చేయకుండా ఆదివాసీ విద్యార్థుల విద్యకు అందించడం శుభపరినామమని పేర్కొన్నారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగ పరుచుకొని ముందుకు సాగాలని విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో వనవాసీ గౌరవ సలహాదారులు బివిఎస్ఎల్ నరసింహారావు, నిలయ కమిటీ సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి, లవన్ కుమార్ రెడ్డి, దాతలు కొత్తపల్లి బోసు, కొత్తపల్లి షన్ముకి, కజ్జం భాస్కర్, మాగంటి నాగేంద్ర పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం

✍ జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 05.



తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామ పరిధిలోని మైసనిగుట్ట పైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అమ్మవారిని స్వామి వారిని ఎదురుకోలు కార్యక్రమాన్ని నిర్వహించి కళ్యాణ మంటపానికి తీసుకొని వచ్చారు. అనంతరం వేద బ్రాహ్మణులు వేద మంత్రం చరణాలతో స్వామివారి కళ్యాణ తంతును కమనీయంగా నిర్వహించారు. కళ్యాణ అనంతరం భక్తులు అమ్మవారికి ఓడిబియ్యాన్ని సమర్పించుకొని మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోగుల ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ పలుగుల నవీన్ కుమార్, కొక్కొండ సత్తయ్య, పలుగుల లింగయ్య, గుడి పూజారులు టి.చక్రపాణి, రవి, సంతోష్, కరణం రాజేశ్వర్ శర్మ పబ్బోజు, వీర బ్రహ్మ చారి , పబ్బోజు దశాంత్, అన్నదాత లక్కాకుల కర్ణాకర్, గ్రామస్తులు దొమ్మాట బాబు, పోతరాజు నరసింహులు, తోడేటి జహంగీర్, పలుగుల ప్రేమ్చందర్, కనకరాజు, పోగుల శ్రీను, కొక్కొండ రాము, గడ్డమీది మధు, జేరిపోతుల యాదగిరి, ఇటుక పల్లి భాస్కర్, గొర్ల రామచంద్రం, ఎరుకల శ్రీను, చెన్నూరి మహేష్, గడ్డమీది వేణు, సుమారు 15 గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## చేవెళ్ల రోడ్డు ప్రమాద బాధితురాలిని పరామర్శించిన ఉప్పల్ ఎమ్మెల్యే

✍ జయభేరి, కాప్రా :



కాప్రా డివిజన్ పరిధిలోని సాయి బాబా నగర్ కి చెందిన తాడెం వెన్నెల తాండూర్ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఖానాపూర్ స్టేజి వద్ద ఆర్టీసీ బస్సు ప్రమాద ఘటనలో ఈమె గాయపడి జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి చికిత్స పొందుతున్న ఈమెను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులతో మాట్లాడి హాస్పిటల్ లో అయ్యే ఖర్చు ప్రభుత్వం కట్టే విధంగా చేయడం జరిగింది. అలాగే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన రహదారి భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్, ప్రసాద్ గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.



## భద్రాద్రి గోదావరిలో భక్తుల పుణ్య స్నానాలు

✍ జయభేరి, భద్రాచలం:

కార్తీక పౌర్ణమి సందర్భంగా తెల్లవారు జాము నుంచే భక్తులు పవిత్ర పుణ్య గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, దీపాలు వెలిగించి, సమీప శివాలయాల్లో 365 ఒత్తులు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్తీక పౌర్ణమి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు. పవిత్ర గోదావరి నదిలో దీపాలు వెలిగించి, నది ఒడ్డున దీపారాధన చేశారు. అనంతరం శివాలయాల్లో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్తీకమాసంలో ఉపవాస దీక్షలు చేసి, గోదావరి నది స్నానాలు ఆచరించి,దీపారాధన చేస్తే తాము తెలిసీ తెలియక చేసిన తప్పులు తొలగించి, ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలు చేకూరుతాయని భక్తుల విశ్వాసం. ఈ మాసంలో గోదావరి నదిలో 365 వొత్తులు వెలిగించి, దీపారాధన చేస్తే పుణ్యఫలాలు సిద్ధిస్తాయని కూడా భక్తుల నమ్మకం. కార్తీక మాసంలో కార్తీక పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు భక్తులకు ఎంతో ప్రీతికరమైనవి.

## కార్తీక పౌర్ణమి సముద్ర స్నానం శుభప్రదం

✍ జయభేరి, మచిలీపట్నం:

కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా మచిలీపట్నం మంగినపూడి బీచ్ భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుండి భక్తులు పెద్ద ఎత్తున పవిత్ర పుణ్య స్నానం ఆచరించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సముద్ర స్థానం ఆచరించి పూజలు చేశారు. వేద పండితులతో సముద్ర హారతి కార్యక్రమం నిర్వహించారు.సముద్రంలో స్థానం చేసే భక్తులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గజతగాళ్లు పడవలను సిద్ధం చేశారు.ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ పవిత్రమైనటువంటి మాసం కార్తీక మాసమని పౌర్ణమికి ఒక ప్రత్యేకత ఉందన్నారు ఈ సందర్భంగా మన ఆచారాలు సంస్కృతిని పెంపొందించే విధంగా ఇక్కడ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## రోడ్ల దుస్థితి పై ప్రజల ఆగ్రహం

✍ జయభేరి, చేవెళ్ల:

చేవెళ్ల బస్సు ప్రమాదం జరిగిన తర్వాత వికారాబాద్ జిల్లాలో అధికారుల పాలకులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాయకులు ప్రజా ఆగ్రహానికి గురి అవుతున్నారు. పెద్దేముల్ మండలం బుద్దారం గ్రామస్థులు ధర్నాకు దిగారు. తాండూర్ సంగారెడ్డి రోడ్డు కు మరమ్మతులు చేయాలని రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేసారు. ఈ నేపథ్యంలో వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

## బీటెక్ విద్యార్థి ఆత్మహత్య..

- రెచ్చిపోయిన సీఐ

✍ జయభేరి, చిత్తూరు:

చిత్తూరులోని సీతమ్స్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ విద్యార్థి రుద్ర ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అతని కుటుంబ సభ్యులు న్యాయం కోసం కాలేజీ వద్ద ఆందోళనకు చేయడంతో వారిపై సీఐ రెచ్చిపోయారు. బిడ్డ మరణానికి కాలేజీ యాజమాన్యాన్ని ప్రశ్నించడానికి వచ్చిన కుటుంబికులను ఆయన బలవంతంగా తోసేశారు. దీనిపై న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

